# ప్రజా మనోబలం

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




బంగ్లాదేశ్‌లో ఆగని హింస.. ప్రాణాలు కాపాడుకోబోయి కాలువలోకి దూకి హిందూ యువకుడి మృతి


ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 185 పేజీలు : 04 వెల రూ. 2 గురువారం 08 - 01 - 2026


### ఖమ్మంలో బీఆర్ఎస్‌కు

## మరో షాక్



2 లో

రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు

ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఐదుగురు కార్పొరేటర్లు

తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ముఖ్యమంత్రి

## అరచేతిలో స్త్రీనిధి యాప్ ఉంటే చాలు

- రుణాల పంపిణీ, కిస్తీల చెల్లింపు అన్నీ చేసేయొచ్చు
- రుణాల పంపిణీ, కిస్తీల చెల్లింపులో అక్రమాలకు చెక్
- స్త్రీనిధి రుణాలు పొందిన పూర్తి సమాచారం యాప్‌లో నమోదై ఉంటాయి
- స్త్రీనిధి రుణాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఆర్థిక చేయూత
- రుణ వాయిదాలు ఖాతాల్లో జమ చేశారా? లేదా అని ఇకపై సులువుగా తెలుసుకోవచ్చు
- పొరపాట్లను నివారించేందుకు ప్రభుత్వం 'మన స్త్రీనిధి యాప్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది




హైదరాబాద్ : స్వయం సహాయక సంఘాలకు సాధారణ రుణాలతో పాటు అత్యవసర సమయంలో వ్యాపారాలు చేసుకునేందుకు స్త్రీనిధి ద్వారా ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తోంది. వ్యాపారాలు చేసుకోవడానికి ఆర్థిక చేయూత అందిస్తోంది. అప్పులు తీసుకున్న వారిలో 20 నుంచి 30 శాతం మంది చెల్లింపులు చేయకపోవడం వంటి కారణాలతో గ్రూపులో ఉన్న సభ్యులందరూ ఇబ్బంది పడాల్సి వస్తోంది.కొందరు కిస్తీల డబ్బులను సకాలంలో చెల్లించకుండా వారి సొంతానికి వాడుకుంటారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి బకాయి విషయం అడిగే వరకు వాస్తవాలు వెలుగులోకి రావడం లేదు. ఇలాంటి పొరపాట్లను నివారించేందుకు ప్రభుత్వం 'మన స్త్రీనిధి యాప్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అతివలు అరచేతిలో నుంచే రుణ వాయిదాలు ఖాతాల్లో జమ చేశారా? లేదా అని ఈ యాప్ ద్వారా సులువుగా తెలుసుకోవచ్చు. స్త్రీనిధి రుణాలు పొందిన పూర్తి సమాచారం యాప్‌లో నమోదై ఉంటాయి. తీసుకున్న రుణాలు ఎంత? చెల్లించిన వాయిదాలెన్ని? ఇంకా ఎన్ని బకాయిలు ఉన్నాయనేది - మిగతా 2 లో

### మసీదు కూల్చివేతపై

## ఒవైసీ ఆగ్రహం



2 లో

- శంభాజీనగర్‌లో వక్ఫ్ భూమిలో ఉన్న మసీదు కూల్చివేతపై ఒవైసీ ఆగ్రహం
- ఢిల్లీలోని మసీదు సమీపంలో కూల్చివేతలను కూడా తప్పుబట్టిన వైనం
- వక్ఫ్ గెజిట్ నోటిఫికేషన్ ను కోర్టుకు సమర్పించాలని వక్ఫ్ బోర్డుకు సూచన

### హిజాబ్, బుర్ఖాలను ధరిస్తే

## గోల్డ్ షాపుల్లోకి నో ఎంట్రీ

- ఆల్ ఇండియా జ్యువెలర్స్ అండ్ గోల్డ్ ఫెడరేషన్ కొత్త రూల్
- ముసుగుతో వచ్చే వారికి ఆభరణాలు విక్రయించకూడదని బీహార్‌లో బంగారం వ్యాపారుల నిర్ణయం
- బీహార్ రాష్ట్రంలో అమలు చేయడం ఇదే మొదటిసారి
- బంగారం దుకాణాలలో నేరాలను నిరోధించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- తనిఖీ జరిగాకే షాప్‌లోకి అనుమతి
- ఈ నియమం మహిళలతోపాటు పురుషులకు వర్తింపు
- నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష ఆర్జేడీ



బీహార్ : బీహార్‌లోని ఆభరణాల దుకాణాల యజమానులు కీలక నిర్ణయం తీసుకున్నారు. మాస్కులు, హిజాబ్‌లు, నిఖాబ్‌లు, హెల్మెట్‌లు ధరించి ముఖాలను కప్పుకుని వచ్చే కస్టమర్లకు తమ దుకాణాల్లో ప్రవేశం నిరాకరించాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఈ విధానం అమలు చేయడం ఇదే తొలిసారి. బంగారం దుకాణాలలో నేరాలను నిరోధించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు దుకాణాల యజమానులు తెలిపారు. అయితే, ప్రతిపక్ష రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది రాజ్యాంగ విరుద్ధమని, ఒక నిర్దిష్ట సమాజం యొక్క మతపరమైన భావాలపై దాడి అని ఆరోపిస్తోంది.ముఖం కప్పుకుని వచ్చే కస్టమర్లకు ఆభరణాలు చూపించకూడదని, విక్రయించకూడదని బీహార్ రాష్ట్ర ఆల్ ఇండియా జ్యువెల్లర్స్ అండ్ గోల్డ్ స్మిత్ ఫెడరేషన్ విభాగం నిర్ణయించింది. వినియోగదారులు, యజమానుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని ఫెడరేషన్ విభాగం అధ్యక్షుడు అశోక్ కుమార్ వర్మ వెల్లడించారు. - మిగతా 2 లో

## ఫ్రాన్స్ అధ్యక్షుడు తనను ప్రాధేయపడ్డారు

- ఫ్రాన్స్ అధ్యక్షుడు తనను ప్రాధేయపడ్డారంటూ ట్రంప్ హేళన
- "ప్లీజ్, డొనాల్డ్ ట్రంప్" అంటూ తనను బతిమాలాడాడన్న ట్రంప్
- రిపబ్లికన్ చట్టసభ సభ్యుల సమావేశంలో ట్రంప్ వ్యాఖ్యలు
- ఔషధ ధరల పెంపు విషయంలో ప్రాధేయపడినట్లు వెల్లడి
- ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఫ్రాన్స్ ధరలు పెంచడంతో అమెరికాలోని స్థానిక కంపెనీలకు డిమాండ్



2 లో

## మోదీని ట్రంప్ కిడ్నాప్ చేస్తారా అన్న కాంగ్రెస్ నేత

- బీజేపీ నేతలు స్పందన
- వెనిజువెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసిన అమెరికా
- మన దేశంలో కూడా ఇలాగే జరిగితే పరిస్థితి ఏమిటన్న చవాన్
- దేశ ప్రతిష్టను అవమానించడమే అంటూ బీజేపీ మండిపాటు
- భారత్ ఒక బలమైన రాజ్యమని, వెనిజువెలా వంటి చిన్న దేశంతో పోల్చడం మూర్ఖత్వమన్న బీజేపీ నేతలు



2 లో




## భావోద్వేగాలతో ఆటలొద్దు నదీజలాలపై రాజకీయాలు చేయొద్దు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- తెలంగాణతో నీటి వివాదాలపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు
- సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చన్న చంద్రబాబు
- కొందరు మాట్లాడుతున్న మాటలు తనకు అర్థం కావడం లేదని వ్యాఖ్య
- రెండు రాష్ట్రాల మధ్య విరోధాలు పెంచొద్దని హితవు
- వైసీపీ అక్రమాలపై దర్యాప్తు చేస్తున్నామని వెల్లడి
- రాయలసీమ ఎత్తిపోతలపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపాటు




అమరావతి : ఏపీ సీఎం చంద్రబాబు ఈరోజు పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడుతూ తెలంగాణతో నీటి వివాదాలపై సున్నితంగా, స్పష్టంగా స్పందించారు.గోదావరి నదిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చని చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అభ్యంతరం చెప్పడం సరికాదని, నీటి విషయంలో రాజకీయాలు చేయొద్దని తెలంగాణను కోరారు. "తెలుగు జాతి ఒక్కటే... ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి. రెండు రాష్ట్రాల మధ్య విరోధాలు పెంచుకుని ఇతరులు ఆనందించే పరిస్థితి రావొద్దు" అని హితవు పలికారు.కొందరు మాట్లాడుతున్న మాటలు వింటుంటే... ఆ రాజకీయాలేమిటో తనకే అర్థం కావడం లేదని చంద్రబాబు అన్నారు. గోదావరి నది పైభాగంలో దేవాదుల ఉందని... దేవాదుల నుంచి నీళ్లు వస్తే కింద ఉన్న పోలవరానికే వస్తాయని, కిందికి వచ్చే నీళ్లకు అభ్యంతరం చెబితే అర్థమేమీ ఉండదని - మిగతా 2 లో

### పోలవరం పనులపై

## సీఎం చంద్రబాబు సమీక్ష




- నిర్వాసితులపై పూర్తి ఫోకస్ పెట్టాలని ఆదేశం
- మిగిలిన పనులు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం
- నిర్వాసితుల పునరావాసంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని సూచన
- ఆర్ అండ్ ఆర్ పనులపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్న సీఎం
- మే మొదటి వారంలో మళ్లీ పనులను పరిశీలిస్తానని వెల్లడి

అమరావతి : సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై దృష్టి సారించారు. బుధవారం ఆయన ప్రాజెక్టు సైట్ వద్ద జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులో మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రాజెక్టులో ఇప్పటికే 87 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి - మిగతా 2 లో

# సంపాదకీయం

## భారత ప్రజలమైన మేము...



1946 డిసెంబర్ 9న సరిగ్గా 11 గంటలకు న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ హాల్‌లో రాజ్యాంగ సభ మొదటి సారిగా సమావేశమైంది. ఈ సభలోని సుమారు 300 మంది సభ్యులు నేరుగా ప్రజల ద్వారా ఎన్నికైనవారు కాదు. బ్రిటిష్ ఇండియా ప్రావిన్సుల్లోని శాసనసభలు ఎంపిక చేసినవారు. మూడేళ్లలో 5,546 పేజీల చర్చలు జరిపి, ఈ రాజ్యాంగ సభ 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించింది. 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చింది. అప్పుడు ఈ మొత్తానికైన ఖర్చు రూ.47 లక్షలు. అయితే ఈ రాజ్యాంగ సభకు వెలుపల రాజ్యాంగం కోసం పడిన భిన్న ఆరాటాలను వివరించే పుస్తకం: 'అసెంబ్లింగ్ ఇండియాస్ కాన్స్టి ట్యూషన్'. ఈ 400 పేజీల పుస్తకం ఒకప్పుడు దేశాన్ని పట్టిన రాజ్యాంగ జ్వరాన్ని కళ్లకు కడుతుంది.రాజ్యాంగ ప్రక్రియలో కేవలం మేధావులు మాత్రమే పాల్గొనలేదనీ, ఇంకా 'ఇండియా'గా రూపు దిద్దుకోని భారత నేల నలుమూలలలో ఉన్న సకల జనాలు చురుగ్గా పాలుపంచుకున్నారనీ చెబుతారు రచయితలు. స్వతంత్ర భారతంలో తామెలాంటి పాలన కోరుకుంటున్నారో బలూచిస్తాన్ నుంచి బెజ వాడ వరకు వేలాది మంది పౌరులుగా, సంఘాలుగా, పార్టీలుగా, అధికార ప్రతినిధులుగా, ట్రేడ్ యూనియ న్లుగా తమ సంతకాలతో, వేలిముద్రలతో పంపిన అభ్యర్థనలను, అభిప్రాయాలను తవ్వితీసి, ఈ ఉత్సాహపూరిత ప్రజా కోణాన్ని అంతే ఆసక్తికరంగా వెల్లడించారు రచయితలు. ఉదాహరణకు గౌహతి నుంచి నలిన్‌కాంత బర్కాకటి పంపిన చిన్న కాగితం రాజ్యాంగ సభ సచివాలయానికి 1947 జనవరి 8న అందింది. 'రాజ్యాంగ విషయాల్లో తన అజ్ఞానాన్ని మన్నించమంటూనే', ఏ శాసనసభ్యుడినైనా ఎప్పు డైనా 'రీకాల్' చేసే హక్కు ఓటర్లకు ఉండాలని అతడు రాశాడు. అంటరానితనాన్ని నిర్మూలించకుండా సమైక్య భారతదేశం సాధ్యం కాదని వజీరిస్తాన్‌లోని బన్నూ నుంచి ప్రజా ప్రతినిధి కోటూ రామ్ కోరాడు. మహిళలకు సమాన హక్కులు; మరణశిక్ష రద్దు; జైనులు, బేనె ఇజ్రాయెలీ యూదులతో సహా మైనా రిటీల హక్కులు; నగర బాలురతో సమానంగా గ్రామీణ పిల్లల హక్కుల లాంటివే కాదు, 'చెవిటి మూగ' వారికి ప్రత్యేక గ్యారంటీలు, విశ్వకర్మలకు ఫీజుల్లో రాయితీలు కోరుతూ కూడా లేఖలు అందాయి. విచిత్రంగా తమ లేఖల ద్వారా రాజ్యాంగ సభకు జనమే చట్టబద్ధత కల్పించారంటారు రచయితలు.రాజ్యాంగ చర్చలను రహస్యంగానే ఉంచదలిచిన పెద్దలు ఈ ప్రజాబాహుళ్యపు ఒత్తిడితో రాజ్యాంగం ఏ రూపం తీసుకుంటుందో బహిరంగపరచదలిచారు. 1948 ఫిబ్రవరి 26న ప్రచురించిన డ్రాఫ్ట్ కాన్స్టిట్యూషన్(ఆంగ్లం) బెస్ట్‌సెల్లర్‌గా నిలిచింది. వెల: ఒక్క రూపాయి. ఇది చెల్లించలేనివాళ్లు అణాతో 24 పేజీల సారాంశం చదువుకోవచ్చు. వారంలోనే దీన్ని దాదాపు అన్ని భారతీయ భాషల్లోకి అనువదించడానికి అనుమ తులు కోరుతూ లేఖలు రాసాగాయి. కె.జి.చౌబాల్ అనే మరాఠీ జర్నలిస్టు 'మాతృదేశ సేవ' కోసం తన సేవలను వాడుకోవాలని రాశాడు.ఈ పుస్తకం వెల్లడించే మరో కోణం, 'ఇండియన్ యూనియన్'కు సమాంతరంగా, అప్పటికి స్వతంత్రంగానే ఉండదలిచిన సంస్థానాల్లో కూడా రాజ్యాంగ రచన ఎలా జరిగిందో వివరించడం. సంస్థానాలకు రాజ్యాంగ సభ 93 ప్రాతినిధ్య స్థానాలను ఇచ్చిన ప్పటికీ, తమను తాము ప్రజాస్వామీకరించుకోవడంలో భాగంగా అవి ఈ ప్రక్రియ చేపట్టాయి. రాంపూర్ పాలకుడు తన ప్రజలకు భావస్వేచ్ఛతో సహా తొమ్మిది ప్రాథమిక హక్కులను ప్రసాదించాడు. రత్లామ్ రాజ్యాంగం ఉచిత ప్రాథమిక విద్యను రాజ్య బాధ్యతగా పేర్కొంది. 'మేము ఇప్పటివరకు తమ సొంత రాజ్యాంగాన్ని రూపొందించుకున్న 75 సంస్థా నాలను గుర్తించాం' అంటారు రచయితలు.ఇంకా న్యాయమూర్తులు ఎలా భాగమయ్యారు; ట్రూమన్‌తో సహా అమెరికా, యూకే, ఐర్లాండ్, కెనడా నాయకులు, న్యాయనిపుణుల ఫీడ్‌బ్యాక్ తీసు కోవడం ద్వారా రాజ్యాంగపు ఫస్ట్ డ్రాఫ్ట్ రూపొందించిన సర్ బి.ఎన్.రావు ఇండియా రాజ్యాంగాన్ని 'ప్రపంచ వేదిక'కు ఎలా పరిచయం చేశారు; ఈశాన్య రాష్ట్రాల్లోని గిరిజనులు తమ హక్కుల కోసం ఎలా నిల బడ్డారు లాంటి అంశాలను విపులంగా చర్చించిన ఈ పుస్తకం రాజ్యాంగపు బహుముఖ పార్శ్వాలను తెలుసు కోగోరేవారికి ఆసక్తి కలిగిస్తుంది. కోట్ల మంది ఆశలను ఒక దగ్గర గుదిగుచ్చడం ఎంత దుర్భరమో, అబ్బు రమో కూడా అర్థమవుతుంది. తర్వాతి రాజ్యాంగ సవరణలు ఈ ప్రజా చైతన్యపు కొనసాగింపే!

## భావోద్వేగాలతో ఆటలొద్దు నదీజలాలపై రాజకీయాలు చేయొద్దు



**మొదటిపేజీ తరువాయి** – అన్నారు. తాము ఎప్పుడూ దేవాదులకు వ్యతిరేకం కాదని, తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు కడుతున్నప్పుడు కూడా అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేశారు. నీళ్లు పొదుపు చేస్తే తెలంగాణకూ లాభమేనని, మిగులు నీటిని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నిల్వ చేసుకోవచ్చని సూచించారు.కృష్ణా నదిలో నీళ్లు తక్కువగా ఉండటంతో పైన ప్రాజెక్టులు కడితే నష్టమని, కానీ గోదావరి డెల్టాను కాపాడుకుని కృష్ణా–గోదావరి అనుసంధానం చేస్తే ఇబ్బంది ఉండదని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై కొందరు చేస్తున్న వ్యాఖ్యల్లో అర్థం లేదని, అబద్ధాలను వందసార్లు చెబితే నిజమవుతుందని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు.పోలవరం ఆలస్యంపై గత వైసీపీ ప్రభుత్వాన్ని చంద్రబాబు విమర్శించారు. గత ప్రభుత్వం వల్లే 6–7 ఏళ్లు ఆలస్యమైందని, డయాఫ్రం వాల్ పాడైందని ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పిన తర్వాతే వాళ్లకు తెలిసిందని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా డయాఫ్రం వాల్ కడుతున్నామని, ఫిబ్రవరి 15లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ అక్రమాలపై దర్యాప్తు జరుగుతోందని, కానీ దర్యాప్తు పేరుతో కాలయాపన చేసుకుంటూ పోతే, పనులు పూర్తి చేయడానికి చాలా కాలం పడుతుందని చెప్పారు. అనుమతులు లేని ప్రాజెక్టులకు రూ. 2 వేల కోట్లు ఖర్చు పెట్టారని... ఎన్జీటీకి రూ. 100 కోట్ల జరిమానా కట్టారని దుయ్యబట్టారు.

## ఫ్రాన్స్ అధ్యక్షుడు తనను ప్రాధేయపడ్డారు



**మొదటిపేజీ తరువాయి** – ఒకానొక సందర్భంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మేక్రాన్ తనను ప్రాధేయపడ్డారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఔషధ ధరల పెంపు గురించి ప్రస్తావిస్తూ మేక్రాన్‌ను ఆయన హేళన చేశారు. "ప్లీజ్, డొనాల్డ్ ట్రంప్" అంటూ మేక్రాన్ తనను బతిమాలారని రిపబ్లికన్ చట్టసభ సభ్యుల సమావేశంలో ట్రంప్ వ్యాఖ్యానించారు. గతంలో ఇరువురి మధ్య జరిగిన సమావేశాన్ని ఆయన ప్రస్తావించారు.ఫ్రాన్స్ ఔషధ ధరలను మూడింతలు పెంచాలని తాను మేక్రాన్‌ను కోరినట్టు, అయితే ఆయన తొలుత అందుకు అంగీకరించలేదని ట్రంప్ తెలిపారు. దాంతో ఫ్రాన్స్ నుంచి దిగుమతి అవుతోన్న వస్తువులపై 25 శాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించినట్లు ఆయన వెల్లడించారు. దీంతో మేక్రాన్ తన డిమాండ్లకు అంగీకరించవలసి వచ్చిందని ట్రంప్ పేర్కొన్నారు.టారిఫ్‌ల గురించి హెచ్చరించిన తర్వాత మేక్రాన్ తనను ప్రాధేయపడ్డారని ట్రంప్ అన్నారు. ఒక ఒప్పందం కుదిరిందని, ఔషధాల ధరలను తాను కోరుకున్నంత పెంచుతానని, కానీ ఈ విషయం తమ ప్రజలకు చెప్పవద్దని మేక్రాన్ బతిమాలినట్లు ట్రంప్ తెలిపారు. ఫలితంగా, 10 డాలర్లు ఉన్న ఒక మందు బిళ్లను ఫ్రాన్స్ 30 డాలర్లకు పెంచిందని ఆయన పేర్కొన్నారు.ఫ్రాన్స్ ఔషధాల ధరలు తక్కువగా ఉండటంతో అమెరికాలో వాటి విక్రయం ఎక్కువగా జరిగేదని, దీనివల్ల అమెరికా కంపెనీలకు నష్టం వాటిల్లేదని తెలుస్తోంది. ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఫ్రాన్స్ ధరలు పెంచడంతో అమెరికాలోని స్థానిక కంపెనీలకు డిమాండ్ పెరిగినట్లు నిపుణులు భావిస్తున్నారు. అయితే, ట్రంప్ వ్యాఖ్యలపై మేక్రాన్ లేదా ఫ్రాన్స్ ప్రభుత్వం ఇంకా స్పందించాల్సి ఉంది.

## మోదీని ట్రంప్ కిడ్నాప్ చేస్తారా అన్న కాంగ్రెస్ నేత



**మొదటిపేజీ తరువాయి** – కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్ చేసిన ఒక వ్యాఖ్య ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వెనిజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా ఆర్మీ ఆపరేషన్‌లో పట్టుకుని తీసుకెళ్లిన సంగతి అందరికీ తెలుసు. డ్రగ్స్ కేసుల్లో ఆరోపణలు ఉన్న మదురోను ట్రంప్ ఆదేశాల మేరకు యూఎస్ బలగాలు బంధించాయి. దీన్ని ఉదాహరణగా తీసుకుని చవాన్ మాట్లాడుతూ... వెనిజువెలాలో జరిగినట్టు భారత్‌లోనూ జరిగితే? పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ట్రంప్ మన ప్రధాని మోదీని కూడా కిడ్నాప్ చేస్తారా? అని అడిగారు. అమెరికా తన ప్రయోజనాల కోసం ఏ దేశ నాయకుడినైనా లక్ష్యం చేసుకోవచ్చని, అది మన దేశ స్వాతంత్ర్యానికి ప్రమాదమని చవాన్ ఆందోళన వ్యక్తం చేశారు.ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు మండిపడ్డారు. ఇది ప్రధాని మోదీని కించపరచడమే కాదు, భారత్ ప్రజాస్వామ్యాన్ని, దేశ ప్రతిష్టను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్ ఒక బలమైన రాజ్యమని, వెనిజువెలా వంటి చిన్న దేశంతో పోల్చడం మూర్ఖత్వమని అన్నారు. మరోవైపు, కాంగ్రెస్ వర్గాలు మాత్రం చవాన్ వ్యాఖ్యలను సమర్థిస్తున్నాయి. అమెరికా దూకుడు విధానాన్ని మాత్రమే చవాన్ హెచ్చరిస్తున్నారని, ప్రధానిని ఉద్దేశపూర్వకంగా అనలేదని. ట్రంప్–మోదీ మధ్య మంచి స్నేహం ఉన్నా, ఇలాంటి వ్యాఖ్యలు రెండు దేశాల దౌత్య సంబంధాలకు ఇబ్బంది కలిగించవచ్చని నిపుణులు అంటున్నారు.

## మసీదు కూల్చివేతపై ఒవైసీ ఆగ్రహం



**మొదటిపేజీ తరువాయి** – మహారాష్ట్రలోని శంభాజీ నగర్‌లో వక్ఫ్ భూమిలో ఉన్న మసీదు కూల్చివేతపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. అలాగే ఢిల్లీలోని తుర్క్‌మాన్ గేట్ దగ్గర ఫైజ్–ఎ–ఇలాహి మసీదు సమీపంలో జరిగిన కూల్చివేతలను కూడా ఆయన ఖండించారు. ఆ భూమి పూర్తిగా వక్ఫ్ బోర్డుదే అని స్పష్టం చేశారు.ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న 'సేవ్ ఇండియా ఫౌండేషన్' పిటిషన్‌పై నవంబర్ 12న ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చిందని, కానీ కోర్టు ఆదేశించిన సర్వేలో వక్ఫ్ బోర్డును ఒక పార్టీగా చేర్చకపోవడం ఆశ్చర్యకరమని ఒవైసీ అన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు ఈ కేసులో జోక్యం చేసుకుని, వక్ఫ్ గెజిట్ నోటిఫికేషన్‌ను కోర్టుకు సమర్పించాల్సిందని సూచించారు. రివ్యూ పిటిషన్ వేయకపోవడంతో కోర్టు తప్పుడు నిర్ణయం తీసుకుందని, దీంతో వక్ఫ్ ఆస్తికి నష్టం జరిగిందని విమర్శించారు. 1947లో అది మసీదుగా ఉండేదని గుర్తుచేసిన ఒవైసీ... వక్ఫ్ బోర్డు, మసీదు నిర్వహణ కమిటీ వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని, వాస్తవాలు వివరించి స్టేటస్ కో తెచ్చుకోవాలని సలహా ఇచ్చారు. అంతేకాకుండా, ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌లకు ఇన్ని రోజులైనా బెయిల్ ఇవ్వకపోవడంపై కూడా ఒవైసీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## అరచేతిలో స్త్రీనిధి యాప్ ఉంటే చాలు

**మొదటిపేజీ తరువాయి** – పొందుపరిచారు. పాత రుణాలు ఎంత చెల్లించారనేది స్పష్టంగా తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. సహచర మహిళలు, బ్యాంక్ మిత్ర ఇలా ఎవరికి రుణ వాయిదా డబ్బులు ఇవ్వకుండా ఇంటి నుంచే చెల్లించే అవకాశం ఉంది. స్త్రీనిధి వాయిదా డబ్బును కొందరు లీడర్లు సభ్యులకు తెలియకుండా వ్యక్తిగత అకౌంట్లోకి మళ్లించుకుంటున్నారు. ఇకపై ఈ యాప్ ద్వారా ఇలాంటి అక్రమాలకు చెక్ పడనుంది.

**యాప్ డౌన్‌లోడ్ ఇలా చేసుకోండి :**

స్మార్ట్‌ఫోన్ ఉన్న సభ్యులు ప్లేస్టోర్‌లోకి వెళ్లి మన స్త్రీనిధి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.

అందులో మొబైల్ నెంబర్ నమోదు చేస్తే గ్రూప్, ఇతర వివరాలు రుణాలు కనిపిస్తాయి.

సభ్యులకు ఫోన్ నెంబర్ లేకుంటే వారి బంధువులు, పిల్లల నెంబర్లతో కూడా లాగిన్ చూసుకోవచ్చు.

నమోదులో అగ్రస్థానం : స్త్రీనిధి యాప్ నమోదులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముందు వరుసలో కొనసాగుతోంది. జిల్లాలో 19,895 సంఘాలు రుణాలు తీసుకున్నారు. వీటిలో 33,399 మంది మహిళలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. రాష్ట్రంలోనే




ఉమ్మడి కరీంనగర్ జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. స్త్రీనిధి అధికారులు సంఘాల సమావేశాల్లో యాప్ డౌన్‌లోడ్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

"స్త్రీనిధి రుణాల పంపిణీలో అక్రమాలు, అవకతవకలకు ఎలాంటి తావులేకుండా ఉండేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. సభ్యుల రుణ కిస్తీలు, ఇతర వివరాలు ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు." – దుర్గాప్రసాద్, ఆర్ఎం, పెద్దపల్లి

**ఏమేం ఉంటాయంటే :**

ఇందులో రుణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

గతంలో ఎప్పుడైన తీసుకున్న అప్పు ఎంత మేర చెల్లించారు. ఇంకా ఎంత చెల్లించాలి.

ఇంకా ఎన్ని నెలల వాయిదాలు బకాయిలు ఉన్నాయి.

**డీసీబీ నివేదికలు**

ఈ యాప్‌కి మొబైల్ నెంబరే కీలకం : ఈ యాప్‌ను ఉపయోగించుకోవాలంటే మొబైల్ నెంబర్ కీలకం. అందుకే దీనిని తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. ఒకవేళ అప్‌డేట్ లేకపోతే సంబంధిత అధికారులను సంప్రదించాలి. ఇలా రుణ వాయిదా డబ్బు చెల్లింపులు వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. అక్రమ నిధులను సులువుగా రికవరీ : కొందరు లీడర్లు సభ్యులకు తెలియకుండా వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేసుకుంటున్నారు. కానీ ఇకపై అలాంటి అక్రమాలు జరగడానికి తావు లేదు. యాప్ ద్వారా అక్రమాలు, ఇతర మోసాలకు చెక్ పెట్టవచ్చు. సభ్యులు తాము చెల్లించిన డబ్బు ఆ నెల అకౌంట్లో జమైందా? లేదా? అనేది మొబైల్ ద్వారా చూసి తెలుసుకోవచ్చు. అలాగే అక్రమంగా వాడుకున్న నిధులను ఆలస్యం చేయకుండా గుర్తించి వెంటనే రికవరీ చేయవచ్చు.

## సంక్రాంతికి 6,431 స్పెషల్ బస్సులు

### 50 శాతం అదనపు ఛార్జీలు

### ఈనెల 9, 10, 12, 13, 18, 19 తేదీల్లో

### ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

### ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు ఛార్జీలు

### ఎంజీబీఎస్, జేబీఎస్,

### ఉప్పల్ నుంచి స్పెషల్ బస్సులు



సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో 6,431 ప్రత్యేక బస్సుల నడపనున్నట్టు తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ నెల 9, 10, 12, 13, 18, 19 తేదీల్లో స్పెషల్ బస్సులు నడుస్తాయని పేర్కొంది. ప్రత్యేక బస్సుల్లో 50శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్టు తెలంగాణ ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఉప్పల్ క్రాస్ రోడ్, ఎంజీబీఎస్, జేబీఎస్, ఆరాంఘర్, ఎల్బీనగర్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని వివరించారు.సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు మహాలక్ష్మ పథకం కింద ఉచిత బస్సు రవాణా సదుపాయం యథవిధిగా ఉంటుందని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ అంతగా ఉండదని భావించి రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన రద్దీ ఉన్న నగర ప్రాంతాలకు తీసుకువస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లకు అధికారులు కేటాయిస్తారు. స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టిక్కెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16ను అప్పటి ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో 1.5 శాతం వరకు టిక్కెట్ ధరలను సవరించుకునే వెసులుబాటు సంస్థకు ఉంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ప్రధాన పండుగకు ప్రత్యేక బస్సుల్లో 1.5 శాతం వరకు టిక్కెట్ ధరలను అప్పటి నుంచి అమలు చేస్తుంది. అంటే దీని ప్రకారం రూ.100 టిక్కెట్‌ను రూ.150కి పెంచుతారన్నమాట. టీజీఎస్ఆర్టీసీ ఏర్పడిన అనంతరం ప్రతి ప్రధాన పండుగకు దీన్ని అమలు చేస్తోంది. స్పెషల్ బస్సులు మినహా సాధారణంగా నడిచే ఆర్టీసీ బస్సుల్లో మామూలుగా ఉండే ఛార్జీలే వర్తిస్తాయి. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం అనే వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవాలని అధికారులు తెలిపారు.హైదరాబాద్‌లో ప్రయాణికు లతో అత్యంత రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటుచేస్తామని ఆర్టీసీ తెలిపింది. సంక్రాంతి ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఆర్టీసీ కాల్‌సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033లలో సంప్రదించాలని యాజమాన్యం సూచించింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే అధికారులు అదనంగా ప్రత్యేక రైళ్లను కేటాయించారు. ఖమ్మం రైల్వే స్టేషన్ మీదుగా 11 ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ డి.రాజగోపాల్ పేర్కొన్నారు. జనవరి 9న ప్రారంభమై ఈ నెల 25వ తేదీ వరకు ఈ సర్వీసులు నడుస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ రైళ్లకు సంబంధించి టిక్కెట్ రిజర్వేషన్లు ప్రారంభించారని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ప్రయాణికులకు సూచించారు. వివరాలకు రైల్వేస్టేషన్‌లోని ఎంక్వైరీ కౌంటర్‌ను సంప్రదించాలని తెలిపారు.

## పోలవరం పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష

**మొదటిపేజీ తరువాయి** – చేయాలని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పనులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆదేశించారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు.అదేవిధంగా పోలవరం ఎడమ కాలువ పనులను వేగవంతం చేయాలని సీఎం తెలిపారు. కుడి కాలువ ద్వారా కొల్లేరు ప్రాంతానికి కూడా నీరందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కీలక సూచన చేశారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వచ్చే మే నెల మొదటి వారంలో తాను మళ్లీ పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేస్తానని చంద్రబాబు వెల్లడించారు.

## ఏపీ లిక్కర్ స్కామ్ కేసు

**మొదటిపేజీ తరువాయి** – ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను కుదిపేస్తున్న లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుల మొబైల్ ఫోన్ల నుంచి సేకరించిన డిజిటల్ ఆధారాలపై ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నివేదిక కోర్టుకు చేరింది. ఈ నివేదికను సిట్ అధికారులు తీసుకునే అవకాశం ఉంది. స్కామ్ బయటపడిన వెంటనే చాలా మంది నిందితులు తమ మొబైల్ ఫోన్లను ధ్వంసం చేశారని, రీసెట్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. అయినా ఆధునిక ఫోరెన్సిక్ సాంకేతికతతో డిలీట్ అయిన డేటా, కాల్ రికార్డులు, చాట్స్, ఫైల్స్‌ను రికవరీ చేసినట్టు సమాచారం. ఈ రికవరీ డేటాలో ఏం ఉందో తెలిస్తే కేసు మరింత లోతుగా సాగే అవకాశం ఉంది.ఈ రిపోర్ట్ సిట్ చేతికి అందితే... ఆర్థిక లావాదేవీలు, రాజకీయ నాయకులతో సంబంధాలు, లంచాలకు సంబంధించిన ఆధారాలు వెలుగులోకి రావచ్చు. దీంతో ఇప్పటికే నిందితులుగా ఉన్నవారితో పాటు మరికొందరి పెద్ద పేర్లు కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నివేదికలో ఏం బయటపడుతుందోనని రాజకీయ నాయకులు, అధికారులు ఆందోళన చెందుతున్నారు.

## హిజాబ్, బుర్ఖాలను ధరిస్తే గోల్డ్ షాపుల్లోకి నో ఎంట్రీ

**మొదటిపేజీ తరువాయి** – ముఖాలకు ముసుగులు ధరించి వచ్చే వారిని గుర్తించడం కష్టమని, ఏదైనా దొంగతనం జరిగినప్పుడు సీసీటీవీ ఫుటేజీ సాయంతో గుర్తు పట్టేందుకు ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ముఖాలు కనిపించకుండా దుకాణాల్లోకి ప్రవేశించి దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు దేశవ్యాప్తంగా అనేకం చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. గత ఏడాది మార్చిలో ఇదే తరహాలో వచ్చిన కొందరు దొంగలు భోజ్‌పురి జిల్లాలోని ఒక దుకాణంలో రూ.25 కోట్ల విలువైన ఆభరణాలను చోరీ చేశారు. నవంబర్ నెలలో కూడా సివాన్ నగరంలో ఇలాంటి దోపిడీ జరిగిందని వ్యాపారులు పేర్కొన్నారు.

## ఖమ్మంలో బీఆర్ఎస్‌కు మరో షాక్



**మొదటిపేజీ తరువాయి** – ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి ఎదురు దెబ్బ తగిలింది. ఇటీవల ఆ పార్టీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం విదితమే. ఈరోజు మరో ముగ్గురు కార్పొరేటర్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్పొరేటర్లు ధనియాల రాధ, తోట ఉమారాణి, రుద్రగాని శ్రీదేవిలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇదివరకే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు సీహెచ్ లక్ష్మీ, జి. చంద్రకళ, డి. సరస్వతి, అమృతమ్మ, ఎం.శ్రావణి కూడా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

# భార్య వంట చేయకపోతే విడాకులివ్వాలా?

**హైకోర్టు ఏం చెప్పిందంటే?**

**విడాకుల కేసులో సంచలన తీర్పు వెలువరించిన హైకోర్టు**

**వంట చేయకపోవడాన్ని క్రూరత్వంగా పరిగణించి**

**విడాకులు ఇవ్వలేమన్న ధర్మాసనం**

**పిటిషనర్ అప్పీలును కొట్టేసిన న్యాయస్థానం**

భార్య, భర్తలు ఇద్దరూ ఉద్యోగులుగా ఉన్నపుడు వంట చేయకపోవడం, తల్లికి సహకరించలేదన్న కారణాలను క్రూరత్వంగా పరిగణించి వివాహాన్ని రద్దు చేయడం కుదరదని హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ కారణంతో విడాకులు మంజూరు చేయలేమని స్పష్టం చేసింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉద్యోగం చేస్తున్న భార్య వంట చేయకపోవడం అన్నది భర్తను హింసిస్తున్నట్లుగా చెప్పలేమని, ఇది క్రూరత్వం పరిధిలోకి రాదని ధర్మాసనం వెల్లడించింది. అలాగే అత్తకు వంట పనుల్లో సహకరించకపోవడం అన్నది ఆమెను హింసించినట్లు కాదని పేర్కొంది. ఈ కారణాల మీద వివాహాన్ని రద్దు చేయలేమంటూ సంచలన తీర్పును వెలువరించింది. ఈ మేరకు ఆమె భర్త చేసిన అప్పీల్‌ను హైకోర్టు కొట్టేసింది. భార్య కారణంగా హింసకు గురవుతున్నానని, వివాహాన్ని రద్దు చేయాలని హైదరాబాద్ నగరంలోని ఎల్బీనగర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. దానిని కిందికోర్టు కొట్టేసింది. దీంతో అతడు హైకోర్టులో అప్పీలు దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ నగేశ్ భీమపాకలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి ఇటీవల తీర్పు వెలువరిస్తూ భర్త అప్పీలును కొట్టివేసింది. భర్త




మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 10 వరకు ఆఫీసు విధుల్లో ఉండగా, భార్య ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉద్యోగం చేస్తుందని, ఇలాంటప్పుడు ఉదయం వంట చేయలేదన్న కారణాన్ని క్రూరత్వంగా పరిగణించలేమంది. దాని ఆధారంగా విడాకులు మంజూరు చేయలేమని తెలిపింది.

**దానిని క్రూరత్వంగా పరిగణించలేం :** ఇంట్లో వంట పనుల్లో భార్య సహకరించకపోవడంతో తల్లికి తానే సాయం చేస్తున్నానని భర్త చెబుతున్నారని, అత్తకు కోడలు సహకరించనంత మాత్రాన దాన్ని అత్తను హింసించినట్లుగా పరిగణించలేమని న్యాయస్థానం తెలిపింది. తరచూ పుట్టింటికి వెళుతోందని, తమతో కలిసి ఉండటంలేదన్న దానిపై వివాహమై ఏడాది 9నెలలు కాగా, అందులో తనతో కలిసి ఉన్నది కేవలం 5 నెలలు అని ఒకసారి, 3 నెలలు మాత్రమే అని మరోసారి భర్త వాంగ్మూలం ఇచ్చారని భిన్న ప్రకటనలు ఇవ్వడానికి సరైన కారణం కూడా చెప్పలేదంది. పెళ్లయిన తర్వాత గర్భస్రావం కావడంతో తల్లిదండ్రుల వద్ద ఉండటాన్ని క్రూరత్వంగా పరిగణించలేమంది. తల్లిదండ్రులతో కలిసి ఉంటుందన్న కారణంగా విడాకులు మంజూరు చేయలేమంది.

**పిటిషనర్ అప్పీలును కొట్టేసిన న్యాయస్థానం :** భార్య తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్ట్ జరిగితే దాన్ని భార్య వేధిస్తోందని చెప్పలేమంది. తల్లిదండ్రుల నుంచి వేరు కాపురం పెట్టాలన్నది క్రూరత్వం కిందే వస్తుందని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ అది ఆయా కేసులోని వాస్తవాల ఆధారంగా వర్తిస్తుందని, ప్రస్తుత కేసులో అలాంటి ప్రతిపాదన భార్య చేయలేదని, ఆమె తరపు న్యాయవాది సలహా ఇచ్చినందున దాన్ని క్రూరత్వంగా పరిగణించలేమంది. దైనందిన జీవితంలో చిన్నచిన్న చికాకులు, గొడవలు మానసిక క్రూరత్వంగా పరిగణించి విడాకులు మంజూరు చేయడానికి సరిపోవని, దీర్ఘకాలికంగా హింస కొనసాగుతూ కలిసి జీవించడం సాధ్యం కాదన్నపుడే క్రూరత్వంగా పరిగణించాల్సి ఉంటుందంటూ సమర్‌గోష్ వర్సెస్ జయగోష్ కేసులో సుప్రీంకోర్టు తేల్చి చెప్పిందని పేర్కొంది. అందువల్ల ప్రస్తుత కేసులో భర్త చేసిన ఆరోపణలను క్రూరత్వంగా పరిగణించి విడాకులు మంజూరు చేయలేమంటూ అప్పీలును కొట్టివేసింది.

**విడాకులపై సుప్రీం ఆసక్తికర వ్యాఖ్యలు :** గతంలో ఓ తీర్పు సందర్భంగా వివాహ బంధంపై సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. భార్యాభర్తల బంధం అనేది పరస్పర విశ్వాసంపై ఆధారపడి ఉంటుందని ఓ పిటిషన్ విచారణ సందర్భంగా పేర్కొంది. తనకు విడాకులు మంజూరు చేస్తూ మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. వివాహ బంధం అనేది పరస్పర విశ్వాసం, సహచర్యం, భాగస్వామ్య అనుభవాల పునాదులపై నిర్మితమై ఉంటుందని కేసు విచారణ సందర్భంగా వ్యాఖ్యానించింది.

## అత్త సూటిపోటి మాటలు
## 45 రోజుల పసికందును చంపేసిన తల్లి

**45 రోజుల పసికందు ప్రాణం తీసిన తల్లి**

**ఆసుపత్రిలో వైద్యం కోసం రూ.లక్షలు ఖర్చు**

**మరోపక్క నెలలు నిండకుండానే బిడ్డకు జన్మనిచ్చిన తల్లి**



రోజులు నిండకుండా పుట్టిందని, వైద్య ఖర్చులు భారమయ్యాయని అత్త సూటిపోటి మాటలు కుటుంబ పరిస్థితులు ఆ తల్లి గుండెను పిండేశాయేమో లేక పుట్టిన బిడ్డ పెద్దయ్యాక అందరిలా ఉంటుందో, లేదోనన్న భయం ఆ తల్లిని వెంటాడిందేమో కానీ తానే కడుపు చించుకొని జన్మనిచ్చిన 45 రోజుల పసికందును నులిమేసింది. అమ్మ లాలించి పొత్తిళ్లలో పెంచుతుందని ఆశపడిన రోజుల శిశువు లోకాన్ని చూడకుండానే ఆమె చేతిలో మృత్యుపాశానికి బలైంది.కృష్ణా జిల్లా మోపిదేవి మండలం వెంకటాపురంలో ఈ నెల 2వ తేదీన నెలన్నర పసికందు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. రావి ప్రభుకుమార్‌తో హైదరాబాద్‌కు చెందిన వీరమాచనేని సాయిచైతన్యకు 2024లో వివాహమైంది. నెలలు నిండకుండానే పాప జన్మించింది. ఆసుపత్రిలో వైద్యం కోసం రూ.లక్షలు ఖర్చు చేశారు. మరోపక్క నెలలు నిండకుండానే బిడ్డకు జన్మనిచ్చిందని అత్త వాణి ఈసడింపు మాటలతో కోడల్ని మానసిక క్షోభకు గురి చేయడం మొదలు పెట్టింది. తరచూ ఎత్తిపొడుస్తుండడంతో క్షణమొక యుగంలా ఇంటి వాతావరణం మారింది. బిడ్డ అనారోగ్యం కూడా తోడు కావడంతో భర్తతో ఈ బాధను చెప్పుకోలేక, ఆ తల్లి తనలో తానే మథన పడింది.తనకు జన్మించిన బిడ్డ వల్లే ఇదంతా జరుగుతోందని భావించి బిడ్డను కడతేర్చాలన్న నిర్ణయానికి వచ్చింది. ఈ క్రమంలోనే తీవ్ర మనస్తాపంతో సతమతమవుతున్న తల్లి ఇంట్లో ఎవరూ లేని సమయంలో శిశువును ఇంటి పక్కనే ఉన్న నీటి గుంటల్లో విసిరేసింది. మొదట బిడ్డ కనిపించట్లేదని చెప్పింది. కానీ పోలీసుల విచారణలో తానే చంపేసిన తీరును వివరిస్తూ కన్నీంటి పర్యంతమైంది. 8 మాసాలు మోసి జన్మనిచ్చిన పాపను తానే చంపుకున్నానని గుండలవిసేలా రోదించింది.తన బిడ్డను తానే చంపేసినట్లు తల్లి సాయి చైతన్య విచారణలో ఒప్పుకొంది. అనారోగ్యంతో ఉన్న పాప, మరోవైపు అత్త సూటిపోటి మాటలతో మనస్తాపం చెంది శిశువు నిండు ప్రాణాన్ని తీసినట్టు తెలిపింది. కేసు నమోదు చేసి బాధ్యులైన అత్త, కోడలిని అరెస్టు చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపించామని సీఐ ఈశ్వరరావు తెలిపారు.విడాకులు తీసుకున్న భార్య ఎప్పటికీ కాపురానికి రాదన్న విషయం జీర్ణించుకోలేక ఓ తండ్రి ఇద్దరు పిల్లలను చంపేసి తానూ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెలంగాణ రాష్ట్రంలో జరిగింది. నారాయణపేట జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి వివరాలు తెలిపారు. మరికల్ మండలం తీలేర్ గ్రామానికి చెందిన శివరాములు (32)కు ఊట్కూరు మండలం పెద్దజట్రం గ్రామానికి చెందిన సుజాతతో తొమ్మిదేళ్ల కిందట పెళ్లి జరిగింది. వీరికి కుమార్తె రితిక (8), కుమారుడు చైతన్య (6) ఉన్నారు. వివాహమైన వెంటనే శివరాములు ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. చైతన్య జన్మించక ముందు నుంచే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. తరచూ గొడవలతో సుజాత కుమారుడికి మూడునెలల వయసున్నప్పుడే భర్తను వదిలేసి పుట్టింటికి వెళ్లింది.ఆ తర్వాత శివరాములు హైదరాబాద్ నుంచి స్వగ్రామం వచ్చారు. గత ఏడాది మార్చిలో వీరు కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి శివరాములు ఇంట్లో ముభావంగా ఉండేవాడు. రితికకు దద్దుర్లు రావడంతో సోమవారం సాయంత్రం ఆసుపత్రికి తీసుకువెళు_న్నా అంటూ ఇద్దరు పిల్లలను పొలం వద్దకు తీసుకెళ్లాడు. రాత్రి 9 దాటినా రాకపోవడంతో కుటుంబీకులు ఫోన్ చేయగా మరికల్‌లో ఉన్నట్లు చెప్పాడు. పొలంవద్ద గుడిసెలో పిల్లలు గాఢనిద్రలో ఉన్న సమయంలో తాడుతో ఉరివేసి చంపి సమీపంలోని యాపల్‌చెర్వు వంపు వాగు కల్వర్టులో పడేశాడు.అనంతరం తాను చనిపోయేందుకు గడ్డి మందు తాగాడు. వెంటనే చనిపోవాలని విద్యుత్తు తీగను పట్టుకున్నాడు. షాక్ కొట్టి ఫ్యూజు ఎగిరిపోయింది. జేబులో ఉన్న బ్లేడ్‌తో గొంతు కోసుకున్నాడు. అయినా మరణించకపోవడం, గడ్డిమందుతో కడుపులో మంట రావడంతో తాళలేక విషయాన్ని మిత్రులకు వివరించాడు. పొలం దగ్గరకు వెళ్లి చూసి గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లగా వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై రాము సిబ్బందితో వచ్చి వివరాలు సేకరించారు. యాపల్‌చెర్వు వంపు వాగు కల్వర్టులో వెతకగా పిల్లల మృతదేహాలు లభించాయి. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

# ‘అమ్మకు అక్షరమాల’ కార్యక్రమానికి శ్రీకారం

**అమ్మలకు రాత్రి బడులు**

**నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యం**

**పట్టణాల్లో నిరక్షరాస్యుల మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ**

**పలు ప్రాంతాల్లో రాత్రి బడి ఏర్పాటుకు కార్యాచరణ చేపట్టిన అధికారులు**

పట్టణాలో ఉన్న నిరక్షరాస్యుల మహిళా సంఘాల సభ్యులకు రాయడం, చదవడం, నేర్పించడానికి అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇప్పటికే పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో ఉల్లాస్ కింద పేర్లు నమోదు చేసుకున్నారు. వీరికి పలు ప్రాంతాల్లోనే రాత్రి బడి ఏర్పాటు చేసి అక్షరాస్యత మెరుగుపరేందుకు కార్యాచరణ చేపట్టారు. తాజాగా నగరపాలికతోపాటు మూడు పురపాలికల్లో మొత్తం 17,778 మంది మహిళల ఉల్లాస్ పథకం ద్వారా చదువు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

**పట్టణాల్లో సమాఖ్య సభ్యులకు శిక్షణ :** పురపాలికల పరిధిలో చదువు రాని సంఘాల సభ్యులకు చదువు నేర్పేందుకు వీలు ఉండేలా అక్షరాస్యత కార్యక్రమాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం సమాఖ్యలోని ముగ్గురికి చొప్పున పదాధికారులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో సుమారు 400 మంది పాల్గొన్నారు. కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీఆర్‌పీ)లు ఇద్దరు శిక్షణ ఇచ్చారు. వరుసగా హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి పట్టణాల్లో కూడా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మొత్తం 179 సమాఖ్యలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో నమోదైన నిరక్షరాస్యుల ప్రకారం పది మంది చొప్పున మ్యాపింగ్ చేశారు. సమాఖ్య పరిధిలో శిక్షణ పొందిన పదాధికారులు అక్షరమాలపై పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది.



**ఉన్నత విద్యకు అవకాశం :** స్వశక్తి సంఘాల్లోని మహిళలు చదువును మధ్యలో వదిలేసి ఇబ్బందులు పడుతున్న సంఘ సభ్యులకు మంచి అవకాశం కల్పించనుంది. ఈ టాస్ పథకం ద్వారా దూర విద్య ప్రవేశాలు తీసుకున్నారు. పది, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసేందుకు మహిళా సంఘ సభ్యులు ముందుకొచ్చారు. ఒక వైపు మధ్యలో చదువు మానేసిన వారికి ఉన్నత చదువులు చదువుకునే అవకాశం కూడా ఇక్కడ కల్పిస్తుండగా, మరో వైపు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు మెప్మా ముందుకొచ్చింది. అంతే కాదు శిక్షణ కార్యక్రమాలు ఇచ్చి రాత్రి పూట చదువు చెప్పించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

**డ్వాక్రా మహిళలకు రాత్రి పూట బడులు :** ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నిరక్షరాస్యులైన మహిళల్లో అక్షర వెలుగులు నింపేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుత రోజుల్లో పల్లె, పట్టణం తేడా ఎక్కడ చూసినా డిజిటల్, సాంకేతికత, నగదు రహిత లావాదేవీలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు పొదుపు సంఘాల్లో మహిళలకు ఇవన్నీ నేర్చుకోవడం ఎంతో అవసరం.ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అనే కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఆర్థిక సామాజిక, డిజిటల్ అక్షరాస్యతపై మహిళలకు తరగతులు నిర్వహిస్తోంది. బ్యాంకు అకౌంట్లున్న వారికి వాటి నిర్వహణపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అన్ని జిల్లాలో డ్వాక్రా మహిళలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు, వంట పనిచేసే వారికి ఉల్లాస్ పథకం అమలు చేయనున్నారు.

**మహిళలకు బోధించాల్సింది ఇదే :**

మన ఆచార వ్యవహారాలు
మా ఇంటి మహాలక్ష్మి
పిల్లల పెంపకం- మన బాధ్యత
కుటుంబం-ఇరుగుపొరుగు
పరిశుభ్రత-ఆరోగ్యం
ఎన్నికలు
చట్టాలు తెలుసుకుందాం
డిజిటల్ అక్షరాస్యత

పైన తెలిపిన అంశాల అనుగుణంగా తెలుగు భాష, గణితం దైనందిన వినియోగానికి సంబంధించిన నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో వాచకం రూపొందించారు.మెప్మా ఆధ్వర్యంలో ఎన్నో శిక్షణలు : మెప్మా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఆర్థిక స్వావలంబన, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా వివిధ రకాల శిక్షణలు ఇస్తున్నారు. ముఖ్యంగా అక్షరాస్యత ఉల్లాస్ వంటి పథకాల ద్వారా డిజిటల్ అక్షరాస్యత, బుక్ కీపింగ్ బ్యూటీషియన్, టైలరింగ్, స్వయం ఉపాధి కోర్సులు లాంటివి శిక్షణ ఇస్తున్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్

**తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సినీ నటీమణులు మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్**



మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ సతీసమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, మంత్రి ఆనం ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆయన స్వామివారి తీర్థప్రసాదాలను అందుకున్నారు. అంతేకాకుండా పండితులు ధరమ్ బీర్ గోకుల్‌కు వేదాశీర్వచనం అందజేశారు.తిరుమల శ్రీవారిని వేర్వేరు సమయాల్లో సినీ నటీమణులు మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్‌లు దర్శించుకున్నారు. దర్శన సమయంలో వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్‌లు వెంకన్నను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం వైకుంఠ ఉత్తర ద్వార ప్రవేశం చేశారు. మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.దర్శనం అనంతరం తెలుగు ప్రజలకు మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్‌లు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారిని దర్శించుకున్న తర్వాత జనవరి 14న “అనగనగా ఒక రాజు“ అనే చిత్రం విడుదల కానుందని మీనాక్షి చౌదరి వెల్లడించారు. ఈ ఏడాది మధ్యలో నాగచైతన్యతో నటించిన చిత్రం కూడా విడుదలవుతుందని పేర్కొన్నారు. టీటీడీ అధికారులు మంచి దర్శన ఏర్పాట్లు చేశారని ఐశ్వర్య రాజేశ్ ప్రశంసించారు. సంక్రాంతికి విడుదలయ్యే ప్రతి చిత్రానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు.

**మూడు రోజులు దాదాపు 33 వేల వాహనాలు కొండపైకి :**

వైకుంఠ ఏకాదశి, కొత్త ఏడాది వేడుకల సందర్భంగా తిరుమలకు భక్తుల రాక గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో తిరుమల బాటలో వాహనాలు వెల్లువెత్తాయి. మూడు రోజుల వ్యవధిలోనే (డిసెంబరు 30 నుంచి జనవరి 1 వరకు) తిరుపతి నుంచి తిరుమలకు దాదాపు 33,000 వాహనాలు చేరుకున్నాయి.

**శ్రీవారి దర్శనం:** డిసెంబరు 30వ తేదీన 67,053 మంది, 31న 70,256 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.గురువారం సాయంత్రం 5 గంటల వరకు 40,008 మంది వరకు స్వామివారిని దర్శించుకోగా, వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 1,77,337 మంది భక్తులు ఆ స్వామి వారిని దర్శనం చేసుకున్నారు.తలనీలాల మొక్కు: డిసెంబరు 30వ తేదీన 16,301 మంది తలనీలాలు సమర్పించగా, 31న ఆ సంఖ్య 25,102కు పెరిగింది.హుండీ కానుకలు: భక్తులు సమర్పించిన కానుకలు డిసెంబరు 30న రూ. 2.25 కోట్లు, కాగా 31న రికార్డు స్థాయిలో రూ. 4.79 కోట్ల హుండీ ఆదాయం లభించింది.సుమారు 70 వేల మంది భక్తులు దర్శనానికి వస్తారని అంచనా వేసిన తిరుమల తిరుపతి దేవస్థానం అందుకు తగ్గట్టుగా స్లాట్ విధానాన్ని అమలు చేసింది. ఎక్కడ రిపోర్ట్ చేయాలి? ఏ సమయానికి చేరుకోవాలి? అనే సమాచారాన్ని భక్తులకు ముందే మెసేజ్‌లు పంపించింది. దీంతో వైకుంఠ ఏకాదశి (డిసెంబరు 30) రోజు రికార్డు స్థాయిలో 67,000 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మరుసటి రోజు (డిసెంబరు 31) అదే స్థాయిలో భక్తులకు దర్శన భాగ్యం కలిగిందనట్లు అధికారులు వివరిస్తున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చినా స్లాట్ విధానం అద్భుతంగా పని చేసిందని టీటీడీ అధికారులు స్పష్టం చేశారు.

# దొంగలతో కుమ్మక్కై స్వామివారి సొమ్ము దోచుకున్న పోలీసులు

**బయటపడనున్న అక్రమార్కుల జాతకాలు**

**పరకామణిలో చోరీ కేసు వ్యవహారంలో హైకోర్టు ఆగ్రహం**

**నిందితులతో కొందరు పోలీసులు చేతులు కలిపినట్లు సీఐడీ నివేదిక**

**కేసులో ప్రమేయం ఉన్నవారిపై శాఖాపరమైన చర్యలకు హైకోర్టు ఆదేశం**

తిరుమల శ్రీవారి హుండీ దొంగతో కుమ్మక్కై అతని ఆస్తులను కాపాడేందుకు పోలీసులే రంగంలోకి దిగిన తీరు చర్చనీయాంశంగా మారింది. స్వామివారి సొమ్ముతో రవికుమార్ కూడబెట్టిన రూ.14 కోట్ల ఆస్తులకు గిఫ్ట్ డీడ్ రంగు పూసి చట్టాన్ని అపహాస్యం చేసిన వైనంపైమ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వ పెద్దల అండతో సాగిన వ్యవహారంలో పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించడంతో వారి మెడకు ఉచ్చు బిగుస్తోంది.పెద్దజీయర్ మఠం గుమస్తా రవికుమార్ 2023లో పరకామణిలో చేతివాటం ప్రదర్శిస్తూ పట్టుబడ్డారు. ఏళ్ల తరబడి హుండీ సొమ్మును కాజేసి కూడపెట్టిన ఆస్తులను గిఫ్ట్ డీడ్‌గా శ్రీవారి ఖజానాకు జమ చేయడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. నిందితుడిని కటకటాల వెనక్కి పంపాల్సిన నాటి టీటీడీ ఉన్నతాధికారులు, పోలీసులు లాలూచీ పడి నిందితుడిపై ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం సెక్షన్లు కాకుండా, సాధారణ దొంగతనం కేసులు నమోదు చేయడాన్ని తప్పుబట్టింది. చోరీ కేసు నిందితుడు రవికుమార్ సంపాదించిన ఆస్తులను టీటీడీకి ‘గిఫ్ట్ డీడ్‘గా రాయించుకుని, లోక్ అదాలత్‌లో కేసును రాజీ చేసిన తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అప్పటి పోలీసు అధికారులపై క్రిమినల్ చర్యలకు తాజాగా ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.న్యాయస్థానం ఆదేశాలతో విచారణ నిర్వహించిన సీఐడీ, ఏసీబీ బృందాలు నివేదికను కోర్టుకు సమర్పించాయి. వాటి పరిశీలన తర్వాత పూర్తిస్థాయి విచారణకు కోర్టు అనుమతించడంతో అప్పటి పోలీసు అధికారులపై కేసు నమోదుకు రంగం సిద్ధమైంది. అప్పటి తిరుమల వన్‌టౌన్ సీఐ జగన్‌మోహన్ రెడ్డి, టూటౌన్ సీఐ చంద్రశేఖర్‌లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు సీఐడీ తేల్చింది. అప్పటి ఇంఛార్జి ఈవో ధర్మారెడ్డిని విచారించి, గిఫ్ట్ డీడ్ నిర్ణయం వెనుక ఉన్నవారి హస్తంపై ఆరా తీశారు.ఈ కేసులో కీలక సాక్షి, ఫిర్యాదుదారుడైన ఏవీఎస్ఓ సతీష్ కుమార్ రెండోసారి విచారణకు హాజరయ్యేలోపు రైల్వే ట్రాక్ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. సీఐడీ నివేదికను తీవ్రంగా పరిగణించిన హైకోర్టు బాధ్యులైన పోలీసు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించింది. నాడు చక్రం తిప్పిన అధికారులకు ఇప్పుడు అరెస్ట్ భయం పట్టుకుంది.పోలీసులే దొంగలతో కుమ్మక్కై స్వామివారి సొమ్ముకే ఎసరు పెట్టిన ఘటనపై హైకోర్టు తీర్పుతో అక్రమార్కుల జాతకాలు బయటపడనున్నాయి. ఇప్పటికే పలువురు అధికారులను వీఆర్‌కు పంపగా మరి కొందరు అరెస్ట్ భయంతో గడుపుతున్నారు.




**టీటీడీ పరకామణి కేసులో ప్రత్యేక ఎఫ్ఐఆర్ సీఐడీకి హైకోర్టు సూచన**

టీటీడీ పరకామణి చోరీ కేసు విచారణలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేసులో ప్రమేయం ఉన్న పోలీసు అధికారుల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. కేసు దర్యాప్తులో ముందుకు సాగాలని సీఐడీ, ఏసీబీని ఆదేశించింది. కౌంటింగ్ అంశంలో టేబుల్ ఏర్పాట్లపై సూచనలు ఇవ్వాలని హైకోర్టు తెలిపింది. నిందితులతో కొందరు పోలీసులు చేతులు కలిపినట్లు సీఐడీ నివేదికలో స్పష్టంగా ఉందని, వారి పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. సీఐడీ, ఏసీబీ దర్యాప్తులో తేలిన ఇతర అంశాల పై దర్యాప్తు కొనసాగించ వచ్చునని ఆదేశాలు జారీ చేసింది.అనంతరం తదుపరి విచారణను ఈనెల 8కి వాయిదా వేసింది. తిరుమల పరకామణిలో కానుకల లెక్కింపు విషయంలో సమర్పించిన నివేదికపై టీటీడీను హైకోర్టు మంగళవారం కొన్ని ప్రశ్నలు అడిగింది. లెక్కింపునకు లుంగీలతో వచ్చే బదులుగా ప్రత్యామ్నాయ విధానాన్ని ప్రస్తావించలేదని ప్రస్తావించింది. కానుకల లెక్కింపునకు టేబుళ్ల ఏర్పాటు పై వివరాలు లేవని పేర్కొంది. ఈవోతో చర్చించి వివరాలు కోర్టు ముందు ఉంచుతామని టీటీడీ తరఫున న్యాయవాది తెలిపారు. కేసులో ప్రమేయం ఉన్న వారిపై శాఖాపరమైన చర్యలు అవసరమని హైకోర్టు వ్యాఖ్యానించింది.

# కేపీహెచ్‌బీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భారీ చోరీ

**సర్దార్ పటేల్ నగర్‌లో ఉన్న ఆలయంలో చోరీ**

**అర్ధరాత్రి ఆలయంలోకి ప్రవేశించిన దొంగలు**

**రూ. 50 లక్షల విలువైన వెండి ఆభరణాల చోరీ**

హైదరాబాద్ నగరంలో మరోసారి ఆలయ చోరీ ఘటనతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని సర్దార్ పటేల్ నగర్‌లో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో దొంగలు భారీ చోరీకి పాల్పడ్డారు. అర్ధరాత్రి వేళలో దుండగులు గుడి లోపలికి చొరబడి, గర్భగుడి తాళాలను పగులగొట్టి స్వామివారి వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిపోయారు. ఈ నగల విలువ సుమారు 50 లక్షల రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.ఈ దారుణ ఘటన ఉదయం గుడి తెరిచిన తర్వాతే బయటపడింది. గుడి సిబ్బంది, స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ



పోలీసులు తక్షణమే ఆలయానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దొంగలు ఎలా లోపలికి వచ్చారు, ఏ మార్గంలో పారిపోయారు అనే అంశాలపై క్లూస్ సేకరిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్‌ను సేకరించి, డాగ్ స్క్వాడ్‌ను కూడా రంగంలోకి దింపారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు మొదలుపెట్టారు. దొంగలు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారు అనే విషయాలను త్వరలోనే కనిపెడతామని తెలిపారు. హైదరాబాద్‌లో ఇటీవల కాలంలో ఆలయాల్లో చోరీలు పెరిగిపోతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయాల చుట్టూ మెరుగైన భద్రత, సీసీ కెమెరాలు, రాత్రి వేళలో గస్తీని పెంచాలని కోరుతున్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com